విద్యార్థుల చదువులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే

రామంతాపూర్,జూన్16: వంశరాజ్ సంఘం,అమ్మానాన్న జ్ఞాన మందిరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి,ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, ఈ సంవత్సరం ఉద్యోగాలు పొందిన వారికి ఆదివారం రామంతాపూర్ సాయికృష్ణానగర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున హాజరై బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వంశరాజ్ కమ్యునిటీకి చెందిన విద్యార్థినీవిద్యార్థులు విద్య, వైద్యం విషయంలో ప్రతిభ కనబర్చి స్థోమత లేని వారికి, అలాగే మెడిసిన్ సాధించిన వారికి ఐదు సంవత్సరాలు తాను సొంత ఖర్చుతో చదివిస్తానన్నారు. అనంతరం ఈటల జమున మాట్లాడుతూ వంశరాజ్ సంఘం విద్యార్థులు కష్టపడి వృద్ధిలోకి రావాలని, వారికి తాను అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవాణి,మానవ హక్కుల వేదిక సభ్యులు జీవన్‌కుమార్,రామంతాపూర్ వంశరాజ్ సంఘం అధ్యక్షులు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గోపాల్,ఉపాధ్యక్షులు బాలస్వామి, చిన్నకృష్ణ, వెంకటయ్య, వేణు, బాలు, వీరస్వామి,బాలస్వామి,బాలచందర్, రాము, మల్లేశ్,సురేశ్,శివకుమార్ అమ్మనాన్నల జ్ఞాన మందిరం ఫౌండేషన్ చైర్మన్ దీర్ఘజీవ తిరుపతయ్య,గడ్డం సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలాభివృద్ధి

కీసర, జూన్ 16: ధాతల సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులు శాశ్వతంగా నిలిచిపోతాయని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మండల పరిధి గోధుమకుంటలోని చంద్రకాలనీలో గ్రామ మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి సొంత నిధులతో సీసీ కెమెరాలు, పార్కులో చిన్నారులకు ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. వాటిని ఆదివారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి సొంత నిధులతో కాలనీవాసుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమనారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని,కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చాక గ్రామాలు నిధుల లేమితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కిరణ్‌జ్యోతిప్రవీన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

గోధుమకుంటలోని చంద్రకాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి కృషి

ఘట్‌కేసర్,జూన్16: పోచారం మున్సిపాలిటీ సాయినగర్‌లో దాతలు నిర్మించిన భూగర్భ డ్రైనేజీని చైర్మన్ కొండల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. దాదాపు రూ.1.30వేలతో సుమారు 3వందల మీటర్ల పొడవున నిర్మించిన ఈ డ్రైనేజీని చైర్మన్ కొండల్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మున్సిపాలిటీ అన్ని వార్డుల్లో భూగర్భ డ్రైనేజి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం..

అల్వాల్‌కు చెందిన పద్మకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూన్ 16: పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందజేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ ఆఫీస్‌లో అల్వాకు చెందిన పద్మ చికిత్స కోసం రూ.33వేలు, మౌలాలి డివిజన్ మారుతీనగర్‌కు చెందిన శ్రీధర్‌కు రూ.1.50లక్షల సీఎంఆర్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు ఇంటి వద్ద ఆరోగ్య సేవలు అందించడానికి బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మల్కాజిగిరిలో ఏరియా దవాఖానలు సేవలందిస్తున్నాయని అన్నారు. దుండిగల్‌లోని అరుంధతి దవాఖానలో ఉచితంగా గుండె ఆపరేషన్‌లతో పాటు ఇతర వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శాంతిశ్రీ నివాస్ రెడ్డి, మహేష్, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేతను కలిసిన ఉద్యమకారులు

శామీర్‌పేట, జూన్ 16 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉమ్మడి శామీర్‌పేట మండల బీఆర్ఎస్ నేతలు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులు ఆదివారం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యాచరణ, స్థానిక సంస్థల్లో పార్టీ పాత్ర, ఉద్యమ కార్యాచరణలు వంటి అంశాలు మాట్లాడడం పాటు ఉద్యమ సమయంలో చేపట్టిన కార్యక్రమాలను నెమరు వేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీతారాములుగౌడ్, మండల ప్రచార కార్యదర్శి కలికోట ప్రభాకర్, మాజీ కార్యదర్శి శంకర్, యాదగిరి, నాగేశ్, ఆంజనేయులు, రాములునాయక్, మహేందర్, సురేశ్, వెంకటేశ్, నర్సింగ్‌రావు, రవి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కాప్రా చెరువు వద్ద పారిశుధ్య పనులు

కాప్రా, జూన్ 16: ఘట్‌కేసర్ శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్ఎన్ఐఎస్‌టీ)కి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం 'కాప్రా లేక్ క్లీన్ ఆఫ్' పేరుతో కాప్రా చెరువు దాని పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. చెరువుతో పాటు సమీపంలోని 'మినీ పాండ్'లో ఉన్న చెత్తను ఏరివేసి శుభ్రం చేసి ప్రత్యేక వాహనం ద్వారా తరలించారు. 'సేవ్ కాప్రా లేక్-సేవ్ అవర్ ఫ్యూచర్' నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని కాప్రాచెరువును కాలుష్యరహితంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు.

చెరువు వద్ద చెత్తను తొలగించిన శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ

నేరేడ్‌మెట్, జూన్ 16: పేద విద్యార్థులకు ఉజ్వల భవితకు చదువే ఆధారమని ప్రముఖ సంఘసేవకుడు నాగరాజు అన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆదేశాలమేరకు ఆదివారం ఆర్కేపురం శక్తినగర్‌లోని నిరుపేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఉదయం టిఫిన్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి చదువుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాగరాజు తదితరులు

పేద విద్యార్థులకు అండగా ఉంటాం..

మల్కాజిగిరి, జూన్ 16: పేద విద్యార్థుల చదువులకు అండగా ఉంటామని అల్వాల్ మున్నూరు కాపు సంఘం సూర్ణిల్ల నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం అల్వాల్‌లోని సంఘం కార్యాలయంలో పేద విద్యార్థిని బీటెక్ చదువుతున్న రికిత 4సంవత్సరాలకు అయ్యే ఖర్చు రూ.2.64లక్షలతో పాటు ఇతర విద్యార్థులకు బుక్స్‌ను కీర్తిశేషు ఇప్ప విటల్ జ్ఞాపకార్థం కూతురు పుష్ప అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సురేష్‌కుమార్, శ్రీశైలం, జ్ఞానేశ్వర్, రామమూర్తి, విక్రమ్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న నాయకులు

బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

చర్లపల్లి, జూన్ 16: ప్రయాణికుల సంక్షేమమే ధ్యేయంగా టీఎస్ ఆర్టీసీ కృషి చేస్తుందని కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్ పేర్కొన్నారు. కుషాయిగూడ బస్ డిపో ఆవరణలో ఆదివారం ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలో నూతనంగా రెండు బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామని, 117ఎం కుషాయిగూడ నుంచి మల్లాపూర్ మీదుగా మణికోచంద్, నాచారం పారిశ్రామికవాడ మీదుగా ఉప్పల్‌కు ప్రతి ఇరువై నిమిషాలకు కుషాయిగూడ, ఉప్పల్ నుంచి బస్సు సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా కుషాయిగూడ నుంచి కలెక్టరెట్ అంతాయిపల్లికి నూతన బస్సు సర్వీసు కల్పించామని తెలిపారు. ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి 242డీఎం బస్సు బడ్లగూడ, కీసర, యాదగిరిపల్లి, తిమ్మాయిపల్లి మీదుగా కలెక్టర్ కార్యాలయంతో పాటు దొంగల మైసమ్మ వరకు బస్సు సౌకర్యం కల్పించామని ఆయన తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

జూలై 21న విష్ణునామ సహస్రనామ పారాయణం

రామంతాపూర్,జూన్ 16: జూలై 21న వ్యాస పూర్ణిమ సందర్భంగా లోక కల్యాణం కోసం 500 మందితో విష్ణునామ సహస్రనామ పారాయణం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు బ్రహ్మ శ్రీ శాస్త్రుల రఘురామశర్మ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అదే రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 10వేల విష్ణు సహస్ర నామపారాయణ జరుగుతాయన్నారు. పారాయణం చేసే వారు కుల మత బేదం లేకుండా జరిగే ఈ కార్యక్రమంలో నగరంలోని అందరు పాల్గొన వచ్చునన్నారు.కార్యక్రమంలో పాల్గొనేవారు 9440240881కు సంప్రదించాలన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

మల్లాపూర్,జూన్ 16: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ వార్డు కార్యాలయంలో ఆదివారం ఈసీఐఎల్‌కు చెందిన జీనియా హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో ఉచితంగా వైద్య చికిత్సలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ప్రభుదాస్‌కు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

ప్రపంచం ఆవిష్కరణల మయం

మెంటార్ మెంటీ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

మేడ్చల్, జూన్16: యావత్ ప్రపంచం నూతన ఆవిష్కరణలతో దూసుకుపోతుందని, ఆ దిశగా విద్యార్థులు ముందుకు సాగాల్సిన అవసరం ఉందని టీహబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాస్ మహంకాళిరావు సూచించారు. గౌడవెల్లి హితం కళాశాలలో మెంటార్ మెంటీ కార్యక్రమంలో భాగంగా ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రన్యూడ్ షిప్ అనే అంశం పై ఒక రోజు కార్యక్రమాన్ని ఆదివారం కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల మేనేజ్‌మెంట్లు హాజరయ్యారు. కార్యక్రమంలో కవిత రాజేశ్ బత్తుల, ప్రిన్సిపాల్ అరవింద్, కల్నల్ సుబ్రహ్మణ్యం, సతీష్‌రెడ్డి, కో ఆర్డినేటర్ సంతోష్, శ్రీనివాస్ మద్దిపాటి, గౌరవ్‌గుప్తా ఉన్నారు.

కీసరగుట్టలో నేడు మహాన్యాస రుద్రాభిషేకం

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామికి సోమవారం గర్భాలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నుట్లు ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ తెలిపారు.

పచ్చదనాన్ని పెంపొందించుకుందాం...

మియాపూర్ , జూన్ 16 : పచ్చదనాన్ని పరిరక్షించుకుని మరింత పెంపొందించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. పచ్చదనాన్ని కాపాడుకుని భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని కోరారు. ఆదివారం అంబీర్ చెరువు వాకర్స్ అసోసియేషన్ షూట్ టు షైన్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో శివమ్మ బస్తీ రామాలయం సమీపంలోని చెరువు కట్ట ను శుభ్రంచేసి పరిసరాల్లో మొక్కలు నాటారు. దీనికి కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ హాజరై మాట్లాడుతూ.. కేవలం మొక్కలు నాటడంతోనే చాలదని పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరు తమవంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, నర్సింహులు,వన్నేస్, సతీష్, రామచందర్, నవీన్, మాధవ్, వాసు ,కృష్ణ, సాంబశివరావు, అశోక్, శ్రీదేవి, విజయ్, ధర్మారెడ్డి, వేణుగోపాల్, సుబ్బారావు, గోపాలకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ చెరువు సమీపంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవంలో కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

కొండాపూర్, జూన్ 16 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో ఢిల్లీకి చెందిన నృత్యకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు నాగజ్యోతి, సీతా నాగజ్యోతిల శిష్య బృందం 'కూచిపూడి దర్పణం' పేరిట ప్రదర్శించిన పలు నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

మాతా నిమిషాంబిక అమ్మవారికి పూజలు

బోడుప్పల్ జూన్ 16: బోడుప్పల్ పరిధిలోని శ్రీ మాతా నిమిషాంబికాదేవి ఆలయ 18వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం అమ్మవారి అలంకరణ, తదనంతరం విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, పుణ్యవచనం, ద్వార పూజ, నవగ్రహపూజ క్రతువులు నిర్వహించారు. భక్తులచే సమూహిక చండీ హోమం, మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, ట్రస్ట్ నిర్వాహకులు అశోక్ కుమార్, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక చండీహోమంలో పాల్గొన్న భక్తులు

ఆహారం, దినచర్య మార్పులతో మధుమేహం నియంత్రణ

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 16 : మధుమేహం(డయాబెటిస్) అనేది రోగం కాదని.. జీవక్రియ(మెటబాలిక్ డిజార్డర్)లో లోపమని... ప్రతి రోజు యోగా సాధన, ఆహారం, దినచర్యలో మార్పులు చేసుకుని మనుస్సును ప్రశాంతంగా ఉంచుకుంటే మధుమేహాన్ని నియంత్రించవచ్చని తెలంగాణ స్టేట్ వెస్ట్ అధ్యక్షుడు యాదుకృష్ణ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల ఉచిత మధుమేహ నియంత్రణ క్యాంపు ఆదివారం ముగిసింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ..మధుమేహం అనేది వయస్సుతో సంబంధం లేదని, పలు కారణాలతో అన్ని వయస్సులవారు దానిబారిన పడుతున్నారన్నారు. మధుమేహం వచ్చిందని బాధపడోద్దని, అవగాహనతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యోగా సాధన, ఆటలు, శారీరక శ్రమ, చక్కటి ఆహారం, నిద్ర, ఒత్తిడి లేని జీవితాన్ని గడిపితే మధుమేహం నియంత్రణలో ఉంటుందని, తద్వార జీవితాన్ని ఆనందంగా హాయిగా ఆస్వాదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు, జోనల్ అధ్యక్షుడు రమేశ్ బాబు, అంజిబాబు, సెంట్రల్ ఇన్‌చార్జి శిరీష, శవిదేవి, తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో మధుమేహ నియంత్రణ క్యాంపు ముగింపు సమావేశంలో యాదుకృష్ణ